క్లుప్తంగా

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



పాన్‌గల్: మండలంలోని పాన్‌గల్, కేతేపల్లి, మాందాపూర్, రేమద్దుల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలోని వేసవి శిబిరాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా శిబిరానికి హాజరవుతూ చదువుతో పాటు ఆటపాటలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, డాన్స్ మరియు వివిధ వినూత్న కార్యక్రమాలను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పల్లిచెక్కిలు అందజేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



వనపర్తి: విద్యుత్‌శాఖలోని 327 కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి చీర్ల యాదిసాగర్‌ను తెలంగాణ లేబర్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా లేబర్ సెల్ రాష్ట్ర చైర్మన్ ఆర్.ప్రకాష్‌గౌడ్ ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు. విద్యుత్‌శాఖలో చిన్న డ్రైవర్ స్థాయి నుంచి కార్మికుల కోసం నిత్యం కృషి చేసే తనను లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై యాదిసాగర్ ఆనందం వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం మరింతగా కృషి చేస్తానని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, టీజీఎస్పీడీసీఎల్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు తులసీదాస్ యాదిసాగర్ తదితరులు యాదిసాగర్‌ను అభినందించారు.

యువ కవికి సన్మానం



అమరచింత: హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన తెలుగు భాషచైతన్య సమితి, లక్ష్య సాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ వార్షికోత్సవంలో పట్టణానికి చెందిన యువకవి సాక హరీశ్ పాల్గొని తన కావ్య ప్రతిభ చూపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 500 మంది కవులతో త్యాగరాజ సభా కళావేదిక, కాళోజి సభా వేదిక ప్రాంగణంలో తెలుగు భాష ప్రాధాన్యత అనే అంశంపై కవిత ప్రసంగం చేయడంతో హరీశ్‌కు నిర్వాహకులు బడేసాబ్ చేతుల మీదుగా సన్మానించి ప్రశంసా పత్రం అందించారు.

ప్రజా వ్యతిరేక విధానాలు సరికాదు



ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు నష్టం చేకూరుస్తుందని టీయూసీఐ రాష్ట్ర నాయకులు హనుమంతు, ప్రసాద్ అన్నారు. ఈ నెల 20న జరిగే సమ్మెకు అనుమతించాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మార్చిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌కార్మికులు నరేందర్, షోయబ్, సరిత, గోవర్ధన్, సతీష్ తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు సవారమ్మ దేవర సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతగా భీంపురం జట్టు విజయం సాధించింది. ద్వితీయ బహుమతిని పచ్చర్ల జట్టు, మూడో బహుమతిని ర్యాలంపాడు జట్టు, నాల్గవ బహుమతిని గట్టు జట్టు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, గజేంద్ర, రాముడు, నర్సింహులు, భీమన్న, వెంకటేష, రంగన్న, రాజు, ప్రకాష్, పెద్ద నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం.. కమ్మని భోజనం

- పేదలపై తగ్గనున్న కొనుగోలు భారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పాన్‌గల్ రేషన్ దుకాణంలో బియ్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ (ఫైల్)



కిష్టాపూర్‌లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి(ఫైల్)

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టడంతో పేదలకు నాణ్యమైన భోజనం అందుతోంది. దీంతో ప్రజలపై బియ్యం కొనుగోలు భారం తగ్గడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆహారభద్రత కార్డులున్న వారికి రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. దీంతో చాలా మంది వాటిని వ్యాపారులకు విక్రయించి సన్న బియ్యం కిలో రూ.50కు కొనుగోలు చేసే వారు. ఇప్పుడు సర్కారే సన్నాలు ఇస్తుండటంతో పేదల సంతోషానికి అవధుల్లేవు.

అన్నదాతలకు బోనస్..

రాష్ట్ర ప్రభుత్వం సన్నాలు సాగు చేసే రైతులకు క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో అటు అన్నదాతలకు ఆదాయం పెరిగింది. దీంతో రైతులందరూ సన్నాలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాటిని రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తుండడంతో పేదలు లబ్ధి పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయం అటు ప్రజలు, ఇటు అన్నదాతలకు మేలు కలిగిస్తోంది.

మండల పరిస్థితి

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 35 రేషన్ దుకాణాలు ఉండగా.. వాటి పరిధిలో 13,698 రేషన్ కార్డులు ఉన్నాయి. మండలంలో ఏప్రిల్ 4వ తేదీన మంత్రి జూపల్లి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అప్పటి నుంచి సన్న బియ్యం అందిస్తున్నారు. గతంలో పోలిస్తే బియ్యం తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది రేషన్ డీలర్లు తెలిపారు.

బియ్యం కేటాయింపు ఇలా..

మండలం	దుకాణాలు	రేషన్‌కార్డులు	బియ్యం(క్విం.)
పాన్‌గల్	35	13,698	2780.77
చిన్నంబావి	18	8,862	1632.69
వీపనగండ్ల	17	8,102	1538.01

సన్న బియ్యం బాగున్నాయి



రేషన్ దుకాణం ద్వారా అందిస్తున్న సన్న బియ్యంతో వండిన అన్నం మంచిగా అవుతోంది. గతంలో ఇచ్చే దొడ్డు బియ్యం తిన డానికి పనికిరాకుండా ఉండేవి. మా కుటుంబంలో ఆరుగురం ఉంటే 36 కిలోల బియ్యం అందాయి. గతంలో సన్న బియ్యాన్ని పండుగల సమయంలోనే చూసేవారం. ప్రస్తుతం ప్రభుత్వం పంపిణీ చేస్తుండటంతో కొనుగోలు భారం తగ్గింది.

– లక్ష్మి, కొత్తపేట

ప్రతి నెలా ఇవ్వాలి



ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యం చాలా బాగున్నాయి. బియ్యంలో అక్కడక్కడ నూకలు కనిపించాయి. గతంలో దొడ్డు బియ్యంతో వండితే అన్నం మెత్తగా అయ్యి తినడానికి ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు పంపిణీ చేస్తున్న సన్నాలతో అన్నం బాగుంది. ప్రతి నెలా ఈ బియ్యమే ఇస్తే పేదలకు ఆసరాగా ఉంటుంది.

– విజయమ్మ, పాన్‌గల్

పకడ్బందీగా బియ్యం పంపిణీ



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీని మండలంలోని అన్ని రేషన్ దుకాణాల డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ప్రారంభించిన నెలలో వంద శాతం లక్ష్యం పూర్తయింది. ఈనెల కూడా బియ్యం సక్రమంగా పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. సన్న బియ్యం పంపిణీలు అవకతవకలు చేస్తే డీలర్లపై చర్యలు తప్పవు.

– సత్యానారాయణరెడ్డి, తహసీల్దార్, పాన్‌గల్

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'



దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

గోపాల్‌పేట: భూసమస్యలను వేగంగా పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని రూపకల్పన చేశారని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మండలంలోని ఏదుట్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో పాల్గొని, చదువు రాని రైతులకు సంబంధించిన దరఖాస్తులను నింపేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. భూ సమస్య ఉన్న రైతు రెవెన్యూ సదస్సును వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ చట్టం అమలును వీలైనంత వరకు అక్కడే సమస్యను పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సక్సేషన్ దరఖాస్తులపై ప్రత్యేక చొరవ తీసుకుని, వెంటనే నోటీసులు అందించి, సమస్య పరిష్కారం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. గోపాల్‌పేట మండలంలో ఇప్పటి వరకు మొత్తం 322 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ పాండునాయక్, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



గోపాల్‌పేట: పొలాల్లో తరచుగా వేసే రసాయనిక ఎరువులు కాకుండా పట్టిరొట్ట, వేపాకు, కానుగ ఆకును దుక్కిలో కలిపి దున్నడం, తక్కువ కాలం పంటలు, వాతావరణానికి అనుగుణంగా పంటమార్పిడి చేయడం ద్వారా రైతులు ఎక్కువ దిగుబడి గడించడంతో పాటు భవిష్యత్‌లో వేసుకునే పంటలకు భూసారం ఎక్కువగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్, శాస్త్రవేత్త భానుశ్రీ అన్నారు. గురువారం మండలంలోని పొలికెపాడులో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను మోతాదుకు మించకుండా వాడాలని సూచించారు. సేంద్రియ, పశువుల పేడ, వానపాముల ఎరువులు వేసి పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ పామాయిల్ పంట సాగు, దిగుబడి, మార్కెటింగ్ వివరాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ రఘు, ఉపాధ్యక్షుడు రాములు, కాంగ్రెస్ ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మానవపాడు: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ వైద్యుడు సమరసింహారెడ్డి, డాక్టర్ జేజే బాబుగడ్డ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అదే విధంగా ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చంద్రన్న, జయమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులందరూ ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి జయరాములు

వీపనగండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను పూర్తి స్థాయిలో నిలువరించాలంటే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి జయరాములు అన్నారు. శుక్రవారం బొల్లారం గ్రామంలో పార్టీ మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎన్నో పోరాటాల వల్ల సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ఎన్నో కుట్రలు చేస్తుందని ఆరోపించారు. శ్రామికులకు శ్రమకు తగ్గ వేతనాన్ని ఇవ్వాలని విన్నవించినా పట్టించుకోక పోగా నిత్యవసర సరుకుల ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. శ్రమదోపిడికి గురవుతున్న కార్మికులను ఇబ్బందికి గురిచేస్తూ కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వంక గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాం, రమేశ్, నాయకులు కర్మయ్య, చల్మారెడ్డి, రంజాన్, కృష్ణయ్య, తిరుపతయ్య, వేమన్న పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



పాన్‌గల్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం ఆశా కార్యకర్తలు రేణుక, కవిత, సరస్వతి అవగాహన కల్పించారు. కాలనీలో గాలెన్న వ్యక్తికి డెంగీ పాజిటివ్ రావడంతో బాధిత కుటుంబ సభ్యులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, దోమలు నివారణపై సూచనలు చేశారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి



దేవతండాలో నివాళులర్పిస్తున్న గిరిజనులు



పామిరెడ్డిపల్లిలో అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో గ్రామస్తులు ర్యాలీ చేపట్టారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన ప్రజలకు, పాకిస్తాన్ దాడిలో అమరులైన సైనికులకు సంఘీభావంగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. పాక్‌పై ఎదురు దాడి చేయడానికి అఖిల పక్ష పార్టీల నాయకులు మద్దతు తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, బుచ్చిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘుగౌడ్, యాదగిరిగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, మూర్తి, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు శుక్రవారం రాత్రి మండల కేంద్రంతో పాటు దేవతండాలో గిరిజనులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా యువకులు, నాయకులు కలిసి మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.



ఖిల్లాఘనపురంలో..

కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్, కార్తీక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీపాద్

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యం తగదని, పనుల్లో వేగం పెంచి కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ శ్రీపాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే వర్షాకాలంలో నిర్వహించే వన మహోత్సవానికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలని, రైతుల పొలాల్లో భూమి చదును చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నర్సరీల ఏర్పాటు, ఉపాధి కూలీలకు టెంట్లు, తాగునీరు, కూలీల పెంపు, పనుల పురోగతి, తదితర విషయాలపై చర్చించారు. నిర్దేశించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ పీఓ రఘు, పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఉపాధి' హామీ చట్టంపై అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న రజని

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని సూచన మేరకు శుక్రవారం మండలంలోని పెద్దగూడెంలో ఉపాధి పనుల వద్ద కూలీలకు ఉపాధి హామీ చట్టంపై లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అసిస్టెంట్ ఎం.రఘు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 100 రోజుల పనిదినాలను క్రమబద్ధమైన వేతనాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్రంలో త్వరలో అమలు కానున్న భూభారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాలను అరికట్టాలని, నిత్యం ఎదుర్కొనే వినియోగదారుల సమస్యలు, చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి పూజలు



ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న పుల్గర్‌చర్ల గ్రామస్తులు

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పునర్నిర్మించాలన్న ఉద్దేశంతో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతనమైన ఆలయం కావడంతో చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో సరైన వసతులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. దీంతో గ్రామస్తులందరూ కలిసి ఆలయ ప్రాంగణంలో వసతుల కల్పనకు పూనుకున్నారు. కార్యక్రమంలో ఎద్దుల వెంకట్‌రెడ్డి, బాలనారాయణ, భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మాణిక్యం రెడ్డి, శ్రీను, సుధాకర్, తిరుపతయ్య, నరేష్, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ రుణాలు మంజూరు చేయిస్తాం'



కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: విశ్వకర్మ ద్వారా శిక్షణ పూర్తి చేసుకొని రుణం పొందని అర్హులకు బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణం ఇప్పిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ భరోసా కల్పించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బజార్, కుమ్మరి వీధి, బాల్‌నగర్‌లో వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాలనీల్లో చెత్త కుప్పలు, డ్రెయినేజీలు, దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు చెప్పడంతో మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోపీనాథ్‌యాదవ్, వెంకటేష్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, బొడ్డుపల్లి కొండన్న, మొరార్జీనాయక్, సూర్యవంశం శ్రీను, పట్టణ ప్రధాన కార్యదర్శి దంతోజు నవీన్, ఉపేందర్‌యాదవ్, శివ, గుణగంటి నరేందర్, పవన్, చింటు తదితరులు పాల్గొన్నారు

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం: తప్పిన ప్రమాదం



ఇంట్లో కాలిపోయిన కందులు, జొన్నలు, రాగులు ఇతర సామగ్రి

గోపాల్‌పేట: షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని చాకల్‌పల్లిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చాకల్‌పల్లికి చెందిన కాశయ్య, బక్కమ్మ భార్యాభర్తలు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఎండాకాలం కావడంతో గురువారం రాత్రి ఎప్పటిలాగే బయటపడుకున్నారు. ఫ్రిడ్జ్ రిపేరు కావడంతో కరెంట్‌కు పెట్టి పడుకున్నారు. రాత్రి 11:30 గంటలకు ఫ్రిడ్జ్ పగిలిన శబ్దం రావడంతో లేచి చూసేసరిసి షార్ట్‌సర్క్యూట్ కారణంగా అప్పటికే ఇల్లంతా కాలిపోయింది. ఇంట్లో ఉన్న 15 బ్యాగుల బియ్యం, రెండు సంచుల పెబ్బర్లు, రెండు సంచుల జొన్నలు, ఒక సంచి రాగులు, ఆరు తులాల బంగారు, రూ.మూడు లక్షల నగదు మొత్తం కాలిబూడిదైపోయాయి. పోలీసులకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది శ్రీనివాసులు, ఆర్‌ఐ యాదయ్య, ఎస్‌ఐ నరేష్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో మొత్తం రూ.పదిహేను లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

బస్సులు కరువు.. ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ఆత్మకూర్ నుంచి మరికల్‌కు వెళ్తున్న వనపర్తి ఆర్టీసీ షటిల్ సర్వీస్

అమరచింత: రాష్ట్రంలో ఫ్రీ బస్ సౌకర్యాన్ని కల్పించిన ప్రభుత్వం.. ప్రయాణానికి సరిపడా బస్సు సర్వీసులను నడపడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూర్–మరికల్ గ్రామాలకు గతంలో నారాయణపేట డిపో ద్వారా 4 షటిల్ సర్వీస్‌లను కొనసాగించేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత మరికల్–ఆత్మకూర్ రూట్‌లో కొనసాగే షటిల్ సర్వీస్‌లను రద్దు చేశారు. అప్పటి నుంచి గద్వాల, వనపర్తి ఆర్టీసీ బస్ సర్వీస్‌లను కొనసాగిస్తూ వచ్చారు. అయితే ప్రస్తుతం వాటిని నిలిపివేయడంతో ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూర్–మరికల్ రూట్‌లో ఒకే బస్సును కొనసాగిస్తుండటంతో పాంరెడ్డిపల్లే, కొంకన్వానిపల్లే, ఉంద్యాల, రాంపూర్ గేట్, చిత్తనూర్ గేట్,కన్మనూర్ గేట్, జిన్నారం గ్రామాలకు వెళ్లే వారితో పాటు మరికల్ మీదుగా పాలమూర్, హైదరాబాద్, నారాయణపేట, రాయచూర్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ప్రాంతాల మీదుగా అదనంగా మూడు సర్వీస్‌లను కొనసాగించాలని ఎమ్మెల్యే, డిపో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆత్మకూర్–మరికల్ రూట్‌లో ఆర్టీసీ షటిల్ సర్వీసులను అదనంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.